క్లుప్తంగా

నిరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి



కొల్లిపర: మిచాంగ్ తుపాను నేపథ్యంలో వర్షపు నీరు వరి పొలాల్లో నిల్వ లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఏఓ కె.వెంకటరావు రైతులకు సూచించారు. సోమవారం మండలంలో దావులూరు. కొల్లిపర, తూములూరు, చక్రాయపాలెం గ్రామాల్లోని వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. యంత్రాలు ద్వారా కోసిన ధాన్యాన్ని తడవ కుండా పట్టాలు కప్పుకోవాలని సూచించారు. పనలపై ఉన్నట్లయితే గింజలు మొలకెత్త కుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలని చెప్పారు. తడిస్తే ఎకరా ధాన్యానికి 25కేజీల ఉప్పు కలపాలన్నారు. వర్షం తగ్గే వరకు రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవం



తెనాలిటౌన్: పట్టణంలోని బాలాజీరావుపేట, మహేంద్రకాలనీలో స్వామి అయ్యప్ప పంచముఖ మండప పడిపూజ మహోత్సవం వైభవంగా సోమవారం నిర్వహించారు. గురుస్వామి దుర్గా హరిబాబుస్వామి అయ్యప్పకు అభిషేకాలు, 18 మెట్ల పూజ జరిపారు. కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, కొల్లిపర పవన్‌సాయి, కె.వినోద్ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. రేణుక అయ్యప్ప భక్త బృందం సభ్యులు అయ్యప్ప భక్తి గీతాలు ఆలపించారు. భవాని స్వాములు, శివస్వాములు, అయ్యప్ప మాల ధారులకు భిక్ష, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని మెట్టు శ్రీనివాసరెడ్డి, బలపతి శ్రీను, మాఘం శ్రీకాంత్‌లు పర్యవేక్షించారు.

తెనాలిలో చివరి దశకు పింఛన్ల పంపిణీ



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చివరి దశకు చేరింది. మంగళవారం వార్డు వలంటీర్లు, వెల్ఫేర్ సెక్రటరీలు, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. రామలింగేశ్వరరావుపేటకు చెందిన బి.లక్ష్మికి, చెంచుపేటకు చెందిన జాకిరెడ్డి కోటేశ్వరమ్మకు వృద్ధాప్య పింఛన్లను వెల్ఫేర్ సెక్రటరీ పి.రమాదేవి, వలంటీర్ ఎస్.సాయిమ్మ పంపిణీ చేశారు. అలాగే ఎస్‌వీఆర్ కాలనీకి చెందిన చెరుకూరి సూర్యమ్మకు వెల్ఫేర్ సెక్రటరీ పి.శిరోమణి వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేశారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం తగ్గేవరకు రైతులు తాము పండించిన పంటలపై జాగ్రత్తలు తీసుకోవాలని తాడేపల్లి మండల వ్యవసాయ అధికారి ఆత్మకూరు శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలాలలో నీరు నిలబడకుండా డ్రెయినేజీ వ్యవస్థ ద్వారా నీటిని బయటకు పంపి పొలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అదేవిధంగా పడిపోయిన వరి పొలాలలో విత్తనాలు మొలకలు రాకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని, వరి పంట కోత కోసి బయటకు వచ్చిన ధాన్యాన్ని తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పి జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలి



మంగళగిరి: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ప్రొఫెసర్ పి ఉమామహేశ్వరి అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మా-డి తరగతులు ప్రారంభమయ్యాయి. ఆమె మాట్లాడుతూ సమాజంలో ఫార్మసిస్ట్‌ల పాత్ర ఎంతో విలువైనది అని అన్నారు. విద్యార్థులు, యువత తలచుకుంటే ఏదైనా సాధించవచ్చని అందుకోసం వారు చేయవలసినది వారి గమ్యాలను ఎంపిక చేసుకుని పట్టుదలతో, క్రమశిక్షణతో సాగాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ డాక్టర్ యు శౌరీలు, సెక్రటరీ జి నిర్మలజ్యోతి, ప్రిన్సిపల్ డాక్టర్ పాములరెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిచాంగ్ ముప్పు..

- వరి సాగు రైతుల్లో ఆందోళన
- పంట, ధాన్యం రక్షణలో నిమగ్నం
- అప్రమత్తం చేస్తున్న అధికార యంత్రాంగం



కొల్లిపర శివారులో నేల కొరిగిన వరి పైరు

కొల్లిపర: మిచాంగ్ తుపాన్ హెచ్చరికలతో డెల్టా ప్రాంతంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వర్షం పడుతుండటంతో వరి పంటను కాపాడుకోవటానికి ఉరుకులు పరుగులు తీస్తున్నారు. పంట ఇంటికి చేరుతుందో లేదోనని కలవరం చెందుతున్నారు. సోమవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా ఈదురు గాలులతో వర్షం పడటంతో డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో పలు చోట్ల వరి పంట నేలకి ఒరిగింది. వర్షం ఎక్కువైతే చేతికి వచ్చిన పంట ఎక్కడ చేజారి నేలపాలవుతుందోనని రైతన్నలు మనోవేదనకు గురువుతున్నారు. మండలంలో తూములూరు, వల్లభాపురం, అత్తోట, మున్నంగి, కొల్లిపర, చక్రాయపాలెం, దావులూరు తదితర గ్రామాల్లో వరి పంట 85 శాతం కోతకు వచ్చింది. వారం నుంచి 30 శాతం యంత్రాలతో వరి కోతలు పూర్తి చేశారు. పంటను సురక్షితంగా తమ గృహాలకు చేర్చుకున్నారు. 10 శాతం రైతులు యంత్రాలతో నూర్పిడి చేసి, ధాన్యాన్ని రోడ్లపై, పొలంలో, ఇంటి చుట్టు పక్కల ఖాళీ స్థలంలో ఆరబెట్టారు. వర్షాల కారణంగా కుప్పగా చేర్చి వాటిపై పట్టలు కప్పి, కాపాడుకుంటున్నారు.

వరి పొలాలను పరిశీలించిన అధికారులు

తెనాలిటౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలోని వరి, మినుము పంట పొలాలను సోమవారం మండల అధికారుల బృందం పరిశీలించింది. మండల ప్రత్యేక అధికారి వనజ, తహసీల్దార్ కె.రవిబాబు, వ్యవసాయాధికారి జి.ప్రేమ్ సాగర్ రైతులతో మాట్లాడారు. గాలులు, వర్షానికి వరి పైరు అక్కడక్కడా నేలకొరగడం గమనించారు. రైతులతో ప్రత్యేకాధికారి వనజ మాట్లాడారు. మండలంలో 15వేల ఎకరాల్లో వరి పైరు సాగవుతుండగా.. రెండు వేల ఎకరాల్లో వరికోతలు పూర్తయినట్లు తెలిపారు. వ్యవసాయాధికారి ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ పైరులో గట్లు వెంబడి నీరు నిలబడి ఉన్నట్లయితే గాడి తీసి నీరు బయటకు పంపించాలన్నారు. కోసిన ధాన్యంపై పట్టలు కప్పి భద్రపరుచుకోవాలన్నారు. తహసీల్దారు రవిబాబు మాట్లాడుతూ మట్టి ఇళ్లల్లో నివాసం ఉండేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. నిత్యావసర వస్తువులను రేషన్‌షాపుల ద్వారా అందజేస్తామని చెప్పారు. ఏఈవో జి.మోహన్, వీఏఏలు హర్షిష, దీప్తి, అల్ఫీ పాల్గొన్నారు.

నేలకొరిగిన వరిపైరు

తెనాలిటౌన్: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షానికి వరి పంట నేలకొరిగింది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉదయం నుంచి గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. గాలులు, వర్షం దెబ్బకు కోతకు వచ్చిన వరిపైరు నేలవాలింది. మండలంలో 15వేల ఎకరాల్లో వరి పైరు సాగు చేయగా కేవలం రెండు వేల ఎకరాల్లో మాత్రమే వరికోతలు పూర్తయ్యాయి. మిగతా పంట అంతా పొలంపైనే ఉంది. రాత్రికి వర్షం ఎక్కువైతే పంట పూర్తిగా నేలకొరిగే ప్రమాదముంది. వర్షంనీరు పొలాల్లో నిలబడకుండా గట్లు వెంబడి గాడులు తీసి, నీటిని బయటకు పంపించాలని తెనాలి ఏడీఏ ఉషారాణి, మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ రైతులకు సూచించారు. ఎరుకలపూడి, నందివెలుగు, కఠెవరం, కొలకలూరు ప్రాంతంలో వరి పంట నేలకొరిగింది.

ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు

తెనాలిటౌన్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో తెనాలి డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు అత్యవసర సేవలు అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఈఈ వీవీ చిరంజీవి సోమవారం తెలిపారు. విద్యుత్ తీగలు తెగిపడినా, కరెంట్ స్తంభాలు విరిగినా, వంగినా, లైన్లు మీద చెట్లు పడినా సంబంధిత ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. తీరప్రాంత మండలాల్లో ఫోన్ నంబర్లు 24 గంటలు పనిచేస్తాయని, వినియోగదారులు గమనించాలని కోరారు.

తెనాలి: 9440817535,
రేపల్లె: 9490615536,
గంగడిపాలెం: 9490615538,
లంకెవానిదిబ్బ: 8500626842,
భట్టిప్రోలు: 9490615539,
కొల్లూరు: 9490615530



కొల్లిపరలో ధాన్యం వర్షానికి తడవకుండా కప్పిన పట్టలు



బుర్రిపాలెంలో వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు



ఎరుకలపూడి, కొలకలూరు గ్రామాల పరిధిలో నేలవాలిన వరిపైరు

అధికారులూ.. బీ కేర్ ఫుల్ !

కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: మిచాంగ్ తుపాను తీవ్రత వల్ల నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. పీకలవాగు చుట్టు పక్కల, పురాతన భవనాల్లో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె సోమవారం జాతీయ రహదారి, పాత గుంటూరు, వేలాంగిణి నగర్, ఏటుకూరు రోడ్డు, బుడంపాడు రోడ్డు, బాలాజీ నగర్, నల్లచెరువు తదితర లోతట్టు ప్రాంతాల్ని, అవుట్ ఫాల్ డ్రైన్లను పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుపాను తీవ్రత పెరుగుతున్న రీత్యా నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగర పరిధిలో ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా గతంలో జరిగిన ప్రాణ నష్టం పునరావృతం కాకుండా, పీకల వాగు చుట్టుపక్కల నివాసితులు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఆమె సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో మినహా ఇళ్ల నుంచి బయటకు రావద్దని హితవు పలికారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం (0863-2345103' కి కాల్ చేయవచ్చని చెప్పారు. ఉన్నతాధికారులతో తుపాను పర్యవేక్షణకు నాలుగు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. ముందుగా క్షేత్రస్థాయి పర్యటనలో పలు ప్రాంతాల్లోని అవుట్ ఫాల్ డ్రెయిన్లలో మురుగుపారుదలకు పూడిక, వ్యర్థాల అడ్డంకి గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటిని బెయిల్ అవుట్ చేయడానికి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల్లో ఎక్కడైనా చెట్ల కొమ్మలు విరిగితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌కి చెప్పారు. తాగునీరు సరఫరా జరిగే రిజర్వాయర్లలో విద్యుత్ అంతరాయం కలిగిన సమస్యలు లేకుండా ముందస్తుగా జనరేటర్లని సిద్ధం చేసుకోవాలని ఏఈలను ఆదేశించారు. సచివాలయాల వారీగా కార్యదర్శులు, అధికారులు అందుబాటులో ఉండాలని, వలంటీర్ల ద్వారా ప్రజలకు తుపాను తీవ్రతపై అవగాహన కల్గించాలని ఆదేశించారు.పర్యటనలో ఎస్ఈ (ఎఫ్ఏసీ) సుందరరామిరెడ్డి, ఈఈ కొండారెడ్డి, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శివాలయాల్లో విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తిక మాస సోమవారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వరుడికి అర్చకులు ఉమాపతిశాస్త్రి సమకచమకాలతో అభిషేకాలు నిర్వహించారు. గరుడాచలపాలెంలోని ఉమామహేశ్వరస్వామికి అర్చకులు లక్ష్మీనారాయణ విశేష అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. ఫిరంగిపురంలోని నగరేశ్వరుడికి, కాళహస్తీశ్వరస్వామికి అర్చకులు ఆంజనేయశర్మ, రాజేంద్రనాథ్‌శర్మలు క్షీరాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తెల్లవారుజామునే భక్తులు ఆలయాల్లో సహస్రదీపాలు వెలిగించారు.

జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: వర్షాకాలం ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యురాలు పి.ఎస్తేరురాణి అన్నారు. మండలంలోని తక్కెళ్లపాడు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టారు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. 75మందికి వైద్య పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. అనంతరం వర్షాకాలంలో తీసుకోవాల్సినజాగ్రత్తలు గురించి ప్రజలకు వివరించారు. వర్షాలు పడే సమయంలో పిల్లలు తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమయంలో జలుబు, జ్వరాలు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. వేడితో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు బరువు, ఎత్తు, పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ అన్నామేరి, మేల్ అసిస్టెంట్ బాబావలి, ఎంఎల్‌హెచ్‌పీ సుజాత, ఏఎన్ఎం ఆనందకుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక అంశాలపై పట్టుతోనే సంస్థలో పురోగతి

గుంటూరు ఎడ్యుకేషన్: సబ్జెక్ట్‌పై ప్రాథమిక అంశాలపై పట్టుతోనే కార్పొరేట్ సంస్థలో పురోగతి సాధ్యమని ఏఎన్‌యూ వాణిజ్యశాస్త్ర విభాగ డీన్ బట్టు నాగరాజు తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో సోమవారం ఎంబీఏ విద్యార్థులకు కార్పొరేట్ రంగంలో నైపుణ్యాలపై అతిథి ఉపన్యాసమిచ్చారు. కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించే విద్యార్థులు విజ్ఞానానికి సంబంధించిన ప్రాథమిక అంశాలపై పట్టు కలిగి ఉండాలని సూచించారు. సంస్థ సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటుపడి సత్సంబంధాల్ని నెరపాలని తెలిపారు. ఏ ప్రదేశంలో ఉద్యోగం వచ్చినా అక్కడ చేరే దృక్పథాన్ని అలవర్చుకోవాలని సూచించారు. తద్వారా విజ్ఞానాన్ని, విశ్వాసాన్ని పెంచుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులు ప్రధానంగా పాఠ్యాంశాలపై పట్టు సంపాదించి కార్పొరేట్ రంగంలోకి ప్రవేశించాలని సూచించారు. సంస్థ శిక్షణను సరైన దృక్పథంతో అర్థం చేసుకుని కెరీర్‌లో ఎదగాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సందేహాల్ని నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, సహాయాచార్యులు డి. కల్యాణి, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎస్. మణికంఠ, సీహెచ్ వేదవతి, అనిత పాల్గొన్నారు.

ఘంటసాల గానం చిరస్మరణీయం



పాత గుంటూరు: కళాదర్బార్ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో అమర గాయకుడు, చిరస్మరణీయుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 101వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నాజ్ సెంటర్ ఐలాండ్‌లోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రోటరీ క్లబ్ వడ్లమాని రవి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రామచంద్రరాజు, వ్యాఖ్యాత ఎ.వి.కె.సుజాత, రంగారావు, పగడాల గోపాలరావు, బాలస్వామి, పచ్చిపులుసు సూర్యనారాయణ, డి.చంద్రబాబు , రాజశేఖర్, మొహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

తెలుగు పాటకు ఘంటసాల చిరునామా

తెలుగు పాటకి ఘంటసాల చిరునామా అని, ఆయన మరణించి నాలుగు శతాబ్దాలు దాటినా ఈనాటికీ ఆయన పాటలు నిత్య నూతనంగానే అనిపిస్తాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఘంటసాల చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళుర్పించారు.

నేడు ముక్కోటి ఏర్పాట్లపై సమావేశం

మంగళగిరి: నగరంలో వేంచేసి ఉన్న లక్ష్మీనృసింహా స్వామి ముక్కోటి ఉత్సవాల ఏర్పాట్లపై మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఏ రామకోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న ముక్కోటి రోజు స్వామి వారి దర్శనానికి తరలిరానున్న భక్తులకు ఏర్పాట్లపై నిర్వహించే సమావేశంలో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలి



పట్నంబజారు: మిచాంగ్ తుపాను నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని బాలాజీనగర్ రాజీవ్ గృహకల్ప రోడ్డులోని మొండి వాగును సంబంధిత అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ తుపాను నేపథ్యంలో అవసరమైన సహాయక చర్యల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవుట్‌ఫాల్ డ్రెయిన్లలో పూడిక, ప్లాస్టిక్ వ్యర్థాలు స్తంభించకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పోలవరపు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాంబాబు, నగర పాలక సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర పరిపాలనలో చెరగని ముద్ర రోశయ్య

ఘనంగా నివాళులర్పించిన నేతలు, ఆర్యవైశ్యులు



రోశయ్య విగ్రహానికి నివాళి అర్పించిన మనోహర్, ఆర్యవైశ్య ప్రముఖులు



రోశయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సాంబశివుడు



రోశయ్య చిత్రపటానికి నివాళి

తెనాలి: ఆర్థిక శాఖ మంత్రిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా కొణిజేటి రోశయ్య రాష్ట్ర పరిపాలనలో చెరగని ముద్ర వేశారని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏపీ మాజీ సీఎం, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య రెండో వర్ధంతి సోమవారం నిర్వహించారు. స్థానిక బోసు రోడ్డులోని ఆయన విగ్రహానికి మనోహర్, ఆర్యవైశ్య నేతలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలకమైన సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రోశయ్య, రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపేందుకు తన వంతు కృషి చేశారన్నారు. రోశయ్య కుమారుడు కొణిజేటి శివ, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాల్, కార్యదర్శి బూర్లె నరసింహారావు, సీ గ్రూప్స్ అధినేత వుప్పల వరదరాజులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, పాన్నూరు నాగసూర్యశశిధరరావు, కొణిజేటి గోపి తదితరులు నివాళులర్పించారు.

రోశయ్య ఆర్థిక మంత్రిగా ఉంటే సీఎంలకు ధైర్యం

తెనాలికి చెందిన రాజకీయ ప్రముఖుడు కొణిజేటి రోశయ్య ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతల్లో ఉంటే నాటి ముఖ్యమంత్రి ఎవరైనా ప్రజలకిచ్చిన హామీలను ఎంతో ధైర్యంగా నెరవేర్చుకునేవారని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక బోసు రోడ్డులోని రోశయ్య విగ్రహానికి పూలమాల వేసి ఆయన నివాళులర్పించారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఏర్పాటుచేయటం, ఆయన చేసిన సేవలకు నిలువెత్తు నిదర్శనంగా చెప్పారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికమంత్రిగా రోశయ్య రికార్డు

రోశయ్య 2వ వర్ధంతిని సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ కార్యాలయంలోని కొణిజేటి రోశయ్య హాలులో జరిగిన కార్యక్రమంలో రోశయ్య చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు పూలమాల వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థికమంత్రిగా 16 పర్యాయాలు బడ్జెట్ ప్రవేశపెట్టిన రోశయ్య చరిత్ర సృష్టించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోశయ్య పాలనా సేవలు నిరుపమానం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రెండో వర్ధంతిని సోమవారం స్థానిక గంగానమ్మపేటలోని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కాలేజిలో నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కాలేజి ప్రిన్సిపల్ విజయకృష్ణ మాట్లాడుతూ కొణిజేటి రోశయ్య పరిపాలనాదక్షుడని చెప్పారు. గుప్తా డిగ్రీ కాలేజి స్థాపనలో రోశయ్య అందించిన సహకారం అమూల్యమైందని గుర్తుచేసుకున్నారు. పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల మేనేజర్ ధూళిపాళ్ల శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, కేవీ రవికుమార్, షేక్ రఫీ, ఆర్‌వీ సునీత, టి.శ్రీవిద్య, ఎ.నాగరాజు, ఎ.బాలగోపాల్, టి.రాజేంద్ర, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధం

ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

లక్ష్మీపురం: తెలంగాణలో బీఆర్ఎస్ ఓటమి స్వయంకృతాపరాధమేనని ఎమ్మెల్సీ కె.యస్ లక్ష్మణరావు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ వైఖరి, సిట్టింగ్ ఎమ్మెల్యేలని మార్చకపోవడం, నిరుద్యోగుల దెబ్బ, అతి విశ్వాసం తదితరాల వల్ల ఆ పార్టీ ఓటమి పాలైందని తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చర్చలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలతో దగ్గరగా మెలగక పోవడం ఆయనపై వ్యతిరేకత పెంచిందని తెలిపారు. దీంతో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వ్యవహారశైలి తీవ్ర అసంతృప్తిని పెంచిదని చెప్పారు. రైతు బంధుతో గ్రామాల్లో వ్యవసాయం చేయని భూస్వాములకే ఉపయోగం జరిగిందని, కౌలు రైతులు తమ ఓటు ద్వారా నిరసన తెలియజేశారని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో జాప్యం, పరీక్ష పత్రాల లీకేజీ, గ్రూప్-1 పరీక్ష రెండుసార్లు రద్దు కావడం లాంటి వాటితో యువత తీవ్ర నిరసనను ఓటు ద్వారా తెలియజేశారని వివరించారు. జీతాలు, బిల్లులు చెల్లింపుల్లో జాప్యంతో ఉద్యోగులు వ్యతిరేకించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు, రేవంత్‌రెడ్డి చాకచక్యంతో అందరినీ కలుపుకుపోవడం కాంగ్రెస్ విజయానికి దోహదపడిందని వెల్లడించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మిగతా మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఏకపక్ష ధోరణి, అస్తవ్యస్త విధానాలు ఆ పార్టీ ఓటమికి కారణాలుగా చెప్పుకోవచ్చని తెలిపారు. పలువురు సంస్థ సీనియర్ సభ్యులు, విశ్లేషకులు, మేధావులు తదితరులు చర్చలో పాల్గొని వారి అభిప్రాయాల్ని వ్యక్తం చేశారు.

సాఫ్ట్ స్కిల్స్‌తోనే పోటీ ప్రపంచంలో ఉన్నతి



శిక్షణ పొందిన విద్యార్థులతో రామకృష్ణ ప్రభు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకోవడం ద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించాలని గుంటూరు చలమయ్య-కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు రామకృష్ణప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని కళాశాలలో విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్‌పై నిర్వహించిన శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ ఆధునిక పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఇటువంటి శిక్షణ తరగతుల్ని నిర్వహించడం ఎంతో అవసరమన్నారు. ప్రముఖ ఇంజినీరు సర్వేశ్వరరావు మాట్లాడుతూ వేలాది రూపాయలు ఖర్చు కాగలిగిన కోర్సును మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ విద్యార్థులకు ఉచితంగా అందించడం గొప్ప విషయమని, శిక్షణ పొందిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలను సాధించాలని ఆకాంక్షించారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ గత 15 రోజులుగా కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కమ్యూనికేషన్, ఇంటర్వ్యూ, ఎంప్లాయిమెంట్ స్కిల్స్‌పై శిక్షణ కల్పించినట్లు వివరించారు. ఎంతో ఖర్చుతో కూడుకున్నదైనప్పటికీ డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా అందించినట్లు చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

9న జిల్లాస్థాయి బైబిల్ క్విజ్ పోటీలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామంలో ఈనెల 9న జిల్లా స్థాయి బైబిల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ పి.దాసు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బైబిల్‌లోని న్యాయాధిపతులు, లూకా సువార్త, 2వ కొరింథీయుల పత్రికలో క్విజ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు మంగళవారం లోగా తమపేర్లు నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రతి గ్రూపునకు ముగ్గురు సభ్యులు ఉండాలని, వయస్సు పరిమితి లేదన్నారు. విజయం సాధించిన వారికి నగదు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు 8919762979లో సంప్రదించాలనికోరారు.